


# ఇదే (నా) న్యాయం

—గంటి రమాదేవి



23.5.84

అనంతశయనం ఇంటిముందు గేటునుండి ఇంటివరకు దూరం యాభై అడుగులు మధ్యలో నాలుగయిదడుగుల స్థలం సిమెంటు చేశారు. ఇరు ప్రక్కల సపోటా, జామ, కొబ్బరిచెట్లు, పూల మొక్కలు.

జంకుతూ గేటు తెరిచాడు లక్షణదాసు. తోటలో ఎవరూ లేరు. సపోటాకాయలు గుత్తులు వేళ్ళాడుతున్నాయి చెట్టుకు. జామ పళ్లు చిలకలుకొట్టి పోస్తున్నాయి. బాగా మగ్గినపళ్లు కొన్ని చెట్టుక్రింద పడి వున్నాయి. చెట్టుక్రింద ఆకులు చెత్త లేకుండా శుభ్రంగా వుంది. తోటలో చెట్లకు ఎవరో నీరుపెట్టి, ఎరువువేసి మంచి సంరక్షణ చేస్తున్నారు. అయితే వాటి ఫలాలను ఎవరూ కోసుకోవడం లేదు. రంగు రంగుల గులాబీలు, పసుపు. కుంకం ఎరుపు, లేత ఎరుపు రంగులలో చెట్టునిండా విడిచి వున్నాయి.

లక్షణదాసు, ఇవన్నీ చూస్తూ ఇంటి ముందుకు వచ్చేశాడు. కాలింగ్ బెల్ నొక్కాడు. ఎక్కడో కాలింగుబెల్ చప్పుడు, కుక్కలు మొరిగిన చప్పుడు విన పడింది. గోడ ప్రక్కగా జరిగి నిలబడ్డాడు లక్షణదాసు.

కొంతసేపటికి అనంతశయనం తలుపు తీశాడు. వయస్సు ఏభైపైనే. పల్చగా తలపై వెంట్రుకలు. తలుపు సందులోంచి బయటకు రావాలని నాలుగయిదు కుక్కలు ప్రయత్నిస్తున్నాయి.

అనంతశయనం పేరుపొందిన క్రిమినల్ లాయర్. అయిదేళ్లయి, ప్రాక్టీసు మానేశాడు. తెరమరుగు జీవితం గడుపుతున్నాడు.

లక్షణదాసు నమస్కరించాడు. అనంతశయనం లక్షణదాసుని పరీక్షగా చూశాడు. అయిదున్నర అడుగుల పొడవు, సామాన్యమైన లావు, నల్లటి జుట్టు. ఏ విధమైన ప్రత్యేకత లేనివాడు లక్షణదాసు. లక్షలాది సామాన్యులలో ఒకడు.

'లా కాలేజీలో రెండో సంవత్సరం లా చదువుతున్నానండీ! మీరు ప్రముఖ క్రిమినల్ లాయరని, ప్రాక్టికల్‌గా కొన్ని పాయింట్లు అడిగి తెలుసుకోవాలని వచ్చాను' వినయంగా అన్నాడు లక్షణదాసు.

తలుపులు పూర్తిగా తెరిచాడు అనంతశయనం.

లక్షణదాసు గుండెలు జల్లుమన్నాయి. లోపల ఏడెనిమిది రకాల కుక్కలు దస్కూండ్, స్పేనియల్, బుల్ టెర్రియర్,

ఆల్సేషియన్, ఇవికాక పిల్లి పిల్లలా చిన్న పిగ్మీ కుక్కపిల్ల.

'భయపడకండి. అవేమీ చేయవు. వీటికి ఫీడింగ్ చేస్తూన్నాను. అందుకే నా వెనుకే వచ్చాయి. లేకపోతే బ్యాక్‌యార్డులో 'కెన్నల్'లో వుంచుతాను. ఈ 'పిగ్మీ' మాత్రం నాతోనే వుంటుంది ఇరవై నాలుగు గంటలు. దిస్ పిగ్మీ ఈజ్ మై లైఫ్.' అంటూ అనంతశయనం లోపలికి దారి తీశాడు. వెనుకాలే లక్షణదాస్ లోపలికి వెళ్లాడు. అనంతశయనం సంజ్ఞ చేయగానే కుక్కలన్నీ లోపలికి ఎక్కడికో వెళ్లిపోయాయి ఒక పిగ్మీ తప్ప. పిగ్మీ అనంతశయనం చేతిమీద కూర్చొనివుంది పిల్లి పిల్లలా.

'నాకింకా 'లా'లో పూర్తి జ్ఞానం లేదు. సెక్షన్ మూడువందల నాలుగు-ఎ క్రింద అంటే, అజాగ్రతవల్ల ఎవరికయినా ప్రాణహాని కలిగినట్లయితే, ఆ అజాగ్రతకు కారణమైన వ్యక్తిని, ఈ మూడువందల నాలుగు-ఎ క్రింద ట్రై చేయవచ్చుకదా! కేసు సెషన్సు వరకు వచ్చిన తర్వాత, ఫర్‌దర్ ఎవిడెన్సు అంటూ, సెక్షను మూడువందల రెండు క్రింద ట్రై చెయ్యవచ్చా?' లక్షణదాసు అడిగాడు.

'లా,లో ఇంటర్‌ప్రిటేషను ఒక్కొక్కళ్లది ఒక్కొక్కరకంగా వుంటుంది. అందుచేతే ప్రెసిడెంటు (జరిగిన కేసుల పరిష్కారాలు ఆధారంగా) చాలా కేసులు పరిష్కారమవుతూ వుంటాయి. ఈ మధ్యనే అంటే ఏడెనిమిది నెలల క్రితం ఇటువంటి కేసే ఒకటి వచ్చింది...'

'ఆ కేసులో ఇలాగే జరిగింది. దాని విషయం అడగాలనే వచ్చాను. దాంట్లో ముద్దాయి ఒక ఆటో డ్రైవరు. నిర్లక్ష్యంగా నడిపి ఒక మనిషి చావుకు కారణమయ్యాడని, మొదట్లో అతని మూడువందల నాలుగు-ఏ సెక్షను క్రింద బుక్‌చేసి, హఠాత్తుగా మూడువందల రెండు క్రింద కేసు మార్చి, క్రొత్త ఎవిడెన్స్ పుట్టించి, బలంగా తయారుచేసి అది 'ప్రీ మెడిటేటెడ్ అండ్ కోల్డు బ్లడెడ్ మర్డర్'గా నిరూపించారు. ఆ అమాయకుడు రెండు మూడు రోజులలో ఉరికంబం ఎక్కడానికి సిద్ధంగా వున్నాడు. ప్రెసిడెంటుని మెర్సీ పిటీషన్ తిరస్కరింపబడింది.' మధ్యలో అందుకుని లక్షణదాసు అన్నాడు.

'ఈజ్ ఇట్ ..సో, హి ఈజ్ గోయింగ్ టుబి హేంగ్‌డ్...వాటే వీన్యూస్... ఫెంటాస్టిక్...' అనంతశయనం పట్టరాని ఆనందంతో అరిచినంత పనిచేశాడు 'హి డిసర్వ్స్ ఇట్...నో సిన్నర్ కెన్ ఎస్కేప్ ది వేజెస్ ఆఫ్ సిన్...పాప ఫలంనుండి ఎవరూ తప్పించుకోలేరు.'

'మీరు ప్రాక్టీసు మానేసి అయిదేళ్లు అయింది కదా... ఈ వివరాలన్నీ మీకెలా తెలిసాయి...' లక్షణదాసు అడిగాడు.

'ఎందుకంటే నేను ప్రాక్టీసు మానేసి ఇలా కెడిలో బ్రతకడానికి కారణం, వాడే కనుక. ఈ ముద్దాయి అయిదేళ్ల క్రితం ఒకరింట్లో డ్రైవరుగా పనిచేసేవాడు. వీడి యజమాని పెద్ద వ్యాపారస్తుడు. ఆ యజమానికి ఇద్దరు పిల్లలు. ఆడపిల్ల పెద్దది. కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతూ వుండేది. చిన్నవాడు పసివాడు. పిల్లల్ని కాలేజీకి, స్కూలుకు తీసుకువెళ్లడం ఈ, డ్రైవరు పని. ఆ యజమాని ఈ డ్రైవరును ఎంతో నమ్మకంతో చూసుకునేవాడు. డ్రైవరు కాక ఇంట్లో ఇంకొక నౌకరు వుండేవాడు. పేరు బషీరు.

నాలుగయిదు నెలలు బాగా పనిచేసిన తర్వాత కాలేజీలో చదివే ఆ అమ్మాయిని కిడ్నాప్ చేసి తీసుకుపోయాడు ఈ డ్రైవరు. అయిదువారాల తర్వాత నాలుగువందల మైళ్లు దూరములో డ్రైవరు దొరికాడు ఆ అమ్మాయితో సహా, ఒక కొండమీద ఒక పాడుపడ్డ మసీదులో విచారణ జరిగింది. విచారణ జరిగినన్నాళ్లు, ఇది ప్రముఖ వ్యాపారస్థుడి ఇంటి విషయం కనుక, పూర్తి వివరములతో ఫోటోలతో, ప్రచురించేవారు. మూడు వారాల విచారణ తర్వాత మూడేళ్ల ఆర్. ఐ (కఠిన కారాగారం) వేశారు ఆ డ్రైవరుకు.

ఆ తర్వాత, ఆ వ్యాపారస్థుడికి దుర్దినాలు పట్టుకున్నాయి. జరిగిన అవమానంతో కృశించిపోయాడు. అయిదునెలలు తిరగకముందే ఆ తండ్రీ కూతురు ఏదో విషం తాగి తనువు చాలించారు. పోతు, పోతూ, జరిగినదంతా వ్రాసిపెట్టి పోయారు.


'ఆ వ్యాపారస్థుని పేరు భట్ కదూ!' లక్షణదాసు అడిగాడు.

'నీకెలా తెలుసు?' ఆశ్చర్యంగా అడిగాడు అనంతశయనం.

'మీలాగే నాకుకూడా ఈ కేసులో వ్యక్తిగతంగా ఆసక్తివుంది. ఆ తర్వాత ఏం జరిగింది?' లక్షణదాసు అన్నాడు.

'నేను క్రిమినల్ లాయరుగా ప్రాక్టీసు మానేశాను. ఆ కుటుంబంలో మిగిలిన వంశాకురాన్ని నా యింటికి తీసుకువచ్చాను. బషీరు అంటే నౌకరుకూడా నాతోబాటే వచ్చాడు. గత నాలుగేళ్లుగా వాళ్లిద్దరూ నాతోనే వున్నారు. అయితే పదినెలల క్రితం బషీరు సైకిలుమీద వెడుతూవుంటే, జైలునుంచి విడుదలయిన ఆ డ్రైవరు ఆటో గుద్దుకుని గాయాలతో పోయాడు. ఆ తర్వాత ఆ పిల్లవాడు ఏదో జ్వరంతో, బషీరుమీద బెంగతో ఏమో పోయాడు.

అనంతశయనం చేతిలో కుక్కపిల్ల అతని చేతిలోనుండి జారి, లక్షణదాస్ ప్యాంటు




చివర్లు కొరకసాగింది.

లక్ష్మణదాస్ చిరాగ్గా విదిలించాడు. చిన్న కుక్క ఆవడంవల్ల విసురుగా పడింది అవతలికి. అప్పుడు చూశాడు అనంతశయనం భయంకర రూపం. బలహీనంగావున్న అతని ముఖం, ప్రమాదాన్ని సూచించే, ఎర్ర, రెండు ఎముకలా గుర్తులో ఎర్రలాగా మారింది. మొహం ఎర్రగా మారింది.

'మిష్టర్...ఆ చిన్న కుక్కపిల్లని అలా తన్నడానికి బుద్ధిలేదూ?'

'దీనికెందు కింత ఆవేశపడుతున్నారు! ఆ కుక్కపిల్లని తన్నలేదు. విదిలించాను. అంతే...'

'ఈ సంపంగిని ఎవరూ ముట్టుకోకూడదు. ఇది నా ప్రాణం, అని చెప్పానుగా...'




'అది సరే... ఎవరో క్లైయింటు కుటుంబంలో ఏదో జరిగితే మీరు ఎందుకు ప్రాక్టీసు మానేయ్యాలి? వాళ్ల నౌకరును, పిల్లవాడిని ఎందుకు మీరు పోషించవలసి వచ్చింది?...'

'భడ్, నా స్వయానా అన్న. అమ్మాయి పేరు సంపంగి. అదేపేరు ఈ కుక్కకు పెట్టుకున్నాను.' అనంతశయనం అన్నాడు.

'సంగతి అర్థమైంది. భడ్ ఇంట్లో డ్రైవరుగా పనిచేస్తూ, తెలిసో, తెలియకో సంపంగిని ఇంట్లోనుంచి తీసుకుపోయాడు. డ్రైవరు. జైలునుంచి వచ్చి తన బ్రతుకేదో బ్రతుకుతూవుంటే, మీరు మీ అన్నకిచ్చిన వాగ్దానం ప్రకారం, ఎలాగయినా ఆ అమాయకుడిని సాధించాలని ఇన్నాళ్లూ కాచుకొని వున్నారు. దురదృష్టవశాత్తు అతని నడిపే ఆటోలో గుద్దుకుని ఒకీగు పోవడంతో, మీ క్రిమినల్ లాయరు తెలివి వుపయోగించి, పాతకేసుకు, ఇప్పటి కేసుకు ముడిపెట్టి, ఒకీర్ అప్పటి కేసులో సాక్ష్యం ఇచ్చాడన్న పగతో 'ప్రీమెడిటేటెడ్'గా ఒకీరుమీదకు ఆటో ఎక్కించాడని సాక్ష్యం సృష్టించారు. మీ పగలో ఒక మనిషి ప్రాణం తీస్తున్నారని ఆలోచించలేదు.

'ఏయ్! ఎవరునువ్వు? అసలు నువ్వు లాస్టూడెంటు లేనా!' ఈ కేసులోకే నీకూ సంబంధ ఏమిటి?' చిరాగ్గా అడిగాడు అనంతశయనం.

'నీకూ, ఈ కేసుకీ ఏ సంబంధంవుందో, నాకూ ఈ కేసుకీ అదే సంబంధం. నిందితుడు రాందాస్ ఉర్ఫ్ చిట్టీ, ఈ కేసుతో నీకున్న ఆసక్తి ఏమిటో కనుక్కు రమ్మని నన్ను పంపాడు. సర్కూమ స్టేన్షియల్ ఎవిడెన్సు చాలా బలంగా వుండడంతో, ఆ రాందాస్ రోజులు దగ్గిర పడ్డాయి. అతనంతో నిర్దోషి చెప్పేటంతవరకూ నాకూ తెలియదు.' లక్ష్మణదాసు, ఆగి చెప్పడం ప్రారంభించాడు.

'రాందాసు నా అన్న. నా కన్న అయిదు నిమిషాలు పెద్ద, మేమిద్దరం కవలలం. స్కూలు చదువుదాటలేదు రాందాసు. అతని తప్పుకాదు. చదువు రాలేదు. అంతే. రాందాసు దుర్మార్గుడు కాదు. అప్పుడే భడ్ ఇంట్లో డ్రైవరుగా కుదిరాడు. ఆ తర్వాత నీకు జరిగింది మాత్రం తెలుసు. నిజం తెలీదు.'

లోపలనుండి కుక్కలు అరుపులు విన బడుతున్నాయి. అనంతశయనం వడిలో ఫ్లీకుక్క సంపంగి జోగుతోంది. లక్ష్మణ దాసు, అనంతశయనం ఒకరినొకరు విచిత్రంగా చూసుకున్నారు. ఒకరు అన్నను పోగొట్టుకున్నారు. ఇంకొకరు అందుకు సిద్ధమవుతున్నారు.

'అనంతశయనం! మళ్లీ కలుస్తా. తప్పదు. మా అన్నకిచ్చిన మాట మరి.'

* * *

లక్ష్మణదాసు జైలు లోపల ఖైదీ రాందాసు 'సెల్' వరకు వచ్చాడు. రాత్రి రెండు గంటలవేళ, నిశ్శబ్దంగా దీపాలు వెలుగుతున్నాయి. సెల్ ముందు తోటలో చెట్లు నిద్రపోతున్నాయి.

నిద్రలేని లక్ష్మణదాసు కళ్లు మండుతున్నాయి. ఇంక రెండు గంటలలో ఈ లోకానికి శాశ్వతంగా వీడ్కోలు చెప్పే రాందాసు కళ్ల మంటలు తెలియడంలేదు. మనస్సు భగ్గుమంటోంది.

'నన్ను అన్యాయంగా ఈ పరిస్థితికి గురి చేసిన వాళ్లను వదలకు.' రాందాసు మాటలు, లక్ష్మణదాసు మెదడులో మారు మ్రోగుతున్నాయి.

అయిదేళ్ల క్రితం, అనంతశయనం భట్టు ఇంటికి వెళ్లినప్పుడు, పోతూపోతూ, సరిగ్గా ఇదే మాటలన్నాడు, భట్టు చివరగా.

* * *

సెల్ యాభైఅడుగుల దూరంలో భూతంలా భయంకరంగా, వెలుగు నీడల మధ్య, ప్లాటుఫాం. రాళ్లతో కట్టిన ప్లాటుఫాం. దాదాపు మూడు గజాల పొడవు, ఒక గజం వెడల్పు. ప్లాటుఫాం మధ్యగా కందకం. అయిదారు గజాలలోతు. ప్లాటుఫాంమీద ఆ కందకు కనపడకుండా కర్రతో చేసిన ప్లాంక్స్.

త్రాడు సిద్ధమవుతోంది. జైలు అధికారులు సిద్ధమవుతున్నారు. ఖైదీకి స్నానం చేయించి కొత్తబట్టలు కట్టారు. నల్లటి మాస్కు వేయబోతూవుంటే రాందాసు అన్నాడు.

'నేను చెప్పినమాటలు గుర్తుంచుకో... కాని ఈ పరిస్థితి తెచ్చుకోకు.' వణుకుతూ వున్న గొంతుకతో చెప్పాడు.

'ఈ పరిస్థితి తెచ్చుకోకు...' మాటలు పూర్తికాలేదు.

లక్ష్మణదాసు ఇక ఆపై దృశ్యం చూడలేక పోయాడు. రాందాసు నిర్దోషి అని

తెలుసు. చేతిలో మొహం దాచుకుని రోదిస్తూ, పరుగు పరుగున బయటకు వచ్చే వాడు. క్రితంరోజు రాందాసు చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.

అరగంట తర్వాత బైటకువచ్చిన అధికార్లు కార్లలో వెళ్లిపోతూవుంటే చూస్తూ వుండిపోయాడు లక్షణదాసు.

* * *

'అనాకారికి ఎంతో అందమైన భార్య, చదువుకున్న భార్యకు, బడుద్ధాయి అయిన భర్త, విషయ వాసనలు ఎక్కువగా కల భర్త, భక్తురాలైన భార్య, కోరికలతో కాగే అమ్మాయికి, అసమర్థుడైన భర్త, ఇలా అపమానలతకు మారుపేరే లోకం.

భట్‌గారింట్లో డ్రైవరుగా చేరినప్పుడు పదిహేడేళ్ల సంపంగిని యజమానురాలిగా చూశాను. చదువురాని నా దురదృష్టాన్ని నిందించుకుంటూ, బ్రతకడానికి ఏదో పని అనుకుంటూ, బాగా చదువుకుంటున్న నిన్ను చూసి గర్వపడుతూ, నెలరోజులు గడిపాను.

పరీక్షగా నన్నే సంపంగి రోజూ చూస్తూవుందని నాకు తెలియలేదు. నా ప్రక్కనే కూర్చుని, తనూ డ్రైవింగు నేర్చుకుంటానని నాతో మారాం చేస్తూవుంటే, ఆమె వుద్దేశ్యం నాకు అర్థంకాక, యజమానురాలిగా గౌరవం ఇస్తూ దూరంగా వుండేవాడిని.

తోటలో పనిచేస్తూ, నాపై నీళ్లు చల్లడం, నన్ను తాకాలని ప్రయత్నించడంతో ఆమె వుద్దేశ్యం అర్థం అయి భయం వేసేది. భట్టుగారు తలుచుకుంటే, వుద్యోగం పోవడం ఎల్లావున్న, నా జీవితానికే ముప్పు అని నాకు తెలుసు. ఇరవై రెండో సంవత్సరంలో అడుగు పెడుతున్న నాకు ఇటు నాకరు బషీరుతోగాని, భట్టుగారితోగాని చెప్పాలని తోచలేదు.

ఒకరోజు బషీరు, సంపంగి తమ్ముడిని తీసుకుని ఎటో వెళ్ళాడు. కాలేజీకి తీసుకు వెళ్లాలి సంపంగిని. పిలుచుకు రావడానికి సంపంగి గదిలోకి వెళ్లాను. అక్కడ ఆమె చేసిన పనికి దిగ్భ్రాంతి చెందాను. ఇంట్లో ఎవరూలేరన్న సంగతి నాకు తెలియదు. నేను లోపలికు వెళ్లగానే తలుపులు బిగించింది సంపంగి. ఒక్కొక్క వలుకే వలుస్తూ తన అందాలు ప్రదర్శించింది. అప్పటికి ఇరవై రెండేళ్లని చెప్పానుగా. పారిపోవాలని తోచలేదు. సంపంగి అందాన్ని వేలంపెడితే, కొంతమంది ప్రాణాలను, రాజ్యాలనూ, సర్వస్వాన్ని త్యాగం చెయ్యడానికి సిద్ధ పడతారు. నీలంరంగు కాంతిలో బంగారపు మేనిఛాయ. వికసిస్తున్న యౌవ్వనం. సంపంగికి నేను లొంగిపోయాను.

ఆ రాత్రి బయట కారుషెడ్డులో ఏడుస్తూవుంటే ఏమిటని బషీరు అడిగాడు. ఆ రోజునుంచి వుద్యోగం మానేస్తూన్నానని చెప్పాను. బషీరుఅంటే భట్టుకు చాలా నమ్మకం. ఉద్యోగం కష్టంగావుందని మానేస్తూన్నానని, నా పని తగ్గించారు.

'ఇక పాపుకు రానక్కరలేదు. పిల్లలిద్దర్నీ జాగ్రత్తగా చూసుకో. ఏ కంప్లయింటూ రాకుండా చూసుకో. ఏకంప్లయింటైయినావచ్చిందో . . .' భట్టుగారు చెప్తూ ఆఖరిమాటల కరుకు తనానికి భయపడ్డాను.

పదిరోజులు మామూలుగా గడిచాయి. సంపంగి సూటుకేసుతో వస్తూవుంటే ఏదైనా' వూరికి పోతూవుందేమో ననుకున్నాను. కారు రిపేరుకని గేరేజిలో ఇమ్మని నన్ను బస్సు స్టాండుకు తీసుకుపోతూ వుంటే భట్టుగారిమాటలు గుర్తుండి మాట్లాడకుండా బయలుదేరాను. జహీరాబాద్, మహబూబ్ నగర్, వనపర్తి కర్నూలు ఇలా రోజుకో వూరి తిప్పింది సంపంగి. డబ్బు చాలా తెచ్చింది. నాలుగయిదు రోజులయేసరికి పోలీసులు వెంటాడుతున్నారని తెలుసుకుంది. ఎత్తైన కొండ మీద, వుపయోగంలో లేని మసీదులో దిగాము. ఎవరికీ తెలియకుండా నాలుగు వారాలు గడిపాము. ఆమె తెచ్చిన డబ్బుతో తిండికి లోటు లేకుండా జరిగిపోయింది. ఆ నాలుగయిదు వారాలు నన్ను పిప్పిచేసింది. అంతా ఆమెదే తప్పనికాదు, నేనూ సహకరించాను. పోలీసులు మమ్మల్ని పట్టుకున్నారు.

కేసు విచారణలో అంతా నాదే తప్పన్నారు ఇద్దరిదీ తప్పని వాదించాను. నేను చదువుకోలేదు. కోర్టులూ, వాదనలూ, నాకు తెలీవు. శిక్షపడి జైలుకు వెళ్లేంతవరకు కలలోలాగా జరిగిపోయింది.


విడుదలయి వచ్చిన తర్వాత, ఆటో నడుపుకుంటూవుంటే అనంతశయనం నా గురించి ఆరా తీస్తున్నట్టు తెలిసింది. అనంతశయనం భట్టు తమ్ముడని నాకు తెలీదు.'

రాందాసు చెప్పినదంతా లక్షణదాసు మెదడులో మెదలింది. 'నన్ను అన్యాయంగా ఈ పరిస్థితికి గురిచేసినవాళ్లను వదలకు ...'

తన అన్న ఆత్మశాంతికి తను ఏదైనా చెయ్యాలి ఎలా! 'ఈ పరిస్థితి తెచ్చుకోకు.' రాందాసు హెచ్చరిక గుర్తుకొచ్చింది.

మెరుపులా ఒక ఆలోచన వచ్చింది లక్షణదాసుకు. ఆ మాత్రం త్యాగం చెయ్యడానికి తను సిద్ధమే. కాని తన పగ గురించి ఇంకో జీవిని హింసించే హక్కు తనకెక్కడుంది? అయితే ఇవన్నీ అనంతశయనం ఆలోచించాడా? తన విషాదం, అనంతశయనానికి ఆనందమా! ఒక నిర్ణయానికి వచ్చాడు లక్షణదాసు.

* * *



23.5.84

తోటలో ఎవరూ లేరు. పండిన జామ పండు ఒకటి కోసుకున్నాడు లక్ష్మణదాసు. సపోటా చెట్టు మొదట్లో కుదురుకడుతూ కనిపించాడు అనంతశయనం. లక్ష్మణదాసుని గుర్తుపట్టేడు. అతనికోపం మిన్నుముట్టింది. అనంతశయనం చూస్తూండగా కొమ్మలు విరిచేశాడు, పళ్లు తెంపేశాడు. పుత్రిలా వున్న అనంతశయనం తలలో కళ్లు మెరుస్తున్నాయి కోపంతో. రోజ్ బెడ్ దగ్గరకు వచ్చాడు లక్ష్మణదాసు. పూలు తెంపి పోస్తూ వుంటే పరుగుపరుగున వచ్చాడు అనంతశయనం. ఆయాసపడుతున్నాడు.

అనంతశయనం చేతిలో పిగ్మీ కుక్క, లక్ష్మణదాసు కాళ్లు పట్టుకొంది. రెండు చేతులలో దాని తలక్రిందులుగా పట్టుకున్నాడు దాసు. 'నన్ను క్షమించు, మూగజీవీ! నిన్ను బాధించక తప్పడంలేదు.' అనుకున్నాడు. పిగ్మీ కుక్క బాధగా అరుస్తోంది . . .

'డిసీస్ టూ మచ్ . . . ట్రెస్‌పాసింగ్ అండ్ మెయిమింగ్ యాన్ ఏనిమల్ (జంతు హింస). రొప్పుతూ, ఆవేశంగా అన్నాడు అనంతశయనం.

'సెక్షను ఏమిటో తెలుసా! క్రేట్ క్రిమినల్ లాయర్! ప్రమాదాన్ని, మర్డరుగా చూపించే నీ తెలివికి నా జోహార్లు. నేను లా ఇంకా చదువుతున్నా. అన్ని సెక్షన్లు కంఠోపాఠమే! సెక్షను నాలుగు వందల ఇరవై ఎనిమిది క్రింద వస్తుంది నేను చేసే ఈ నేరం విను. ఒక జంతువును దురుద్దేశంతో, చంపినా, హింసించినా, విషం పెట్టినా, దానికి శిక్ష రెండేళ్లు జైలు, జుల్మానా లేదా రెండునూ. అయితే ఆ జంతువు విలువ పది రూపాయలు మించి వుండాలి. ఈ పిగ్మీ విలువ, పది రూపాయలు దాటుతుందికదూ అనంతశయనం!'

లక్ష్మణదాసు చేష్టలకు మాటలకు, అనంతశయనం, పగలబోయే అగ్నిపర్వతంలా అయ్యేడు.

బాధకు తట్టుకోలేక పిగ్మీ బాధగా అరుస్తోంది. లక్ష్మణదాసు అనుకున్నది జరిగింది అప్పుడు! క్రిందపడ్డ అనంతశయనాన్ని ఒక్క క్షణం తృప్తిగా చూసి గేటు మూసి బయటకు నడిచాడు లక్ష్మణదాసు. పిగ్మీ, క్రిందపడ్డ అనంతశయనం చుట్టూ తిరుగుతూంది!

* * *

'థాంక్స్ ఫర్ టైమ్లీ హెల్ప్ . . . సమయానికి తీసుకరాక పోయినట్టయితే ఈయన 'కార్డియోజీనిక్ షాక్'తో పోయే వుండేవారు.' అనంతశయనాన్ని టేక్సీలో తీసుకువచ్చిన లక్ష్మణదాసుతో అన్నాడు డాక్టరు.

మంచంమీద పడుకున్న అనంతశయనం దగ్గరికి వెళ్లి అన్నాడు లక్ష్మణదాసు.

'మరణబాధ అంటే తెలిసింది నీకు. నల్లటి మాస్కు వేసి, వురి బిగించినప్పుడు, తమ్ముడిగా నేనెంత బాధ పడివుంటానో, నీ సంపంగిని చేతిలోకి తీసుకుని బాధపెట్టినప్పుడు నీకు తెలిసివుంటుంది. కావాలంటే సెక్షను నాలుగువందల ఇరవై ఎనిమిది క్రింద నన్ను అరెస్టుచేయించు. నా అడ్రసు కాగితంమీద వ్రాసి నీ తలగడ క్రింద పెడుతున్నాను.' తన అడ్రసు అనంతశయనం తలగడక్రింద పెట్టాడు.

అనంతశయనం, లక్ష్మణదాసు చెప్పినది విన్నాడు. కాని కంప్లయింట్ చెయ్యాలన్నా చెయ్యలేదు అనంతశయనం. 'హైపోవోల్ మిక్ షాక్'తో మాట్లాడే అదృష్టాన్ని పోగొట్టుకున్నాడు అనంతశయనం.

పిగ్మీ కుంటుకుంటూ 'కుయ్ కుయ్' మని అరుస్తూ, లక్ష్మణదాస్ వెనకే నడుస్తోంది.





ప్రతి ఎంట్రీతోబాటు మైసూర్ లాంప్స బల్బ్ పాకెట్‌పై గల ధర కలిగియున్న పూర్తి లేబుల్‌ను విధిగా జతచేసి పంపాలి

పోటీ ముగింపు తేది 15 జూలై 84



మీ ఎంట్రీలను పంపవలసిన చిరునామా:
ది మైసూర్ ల్యాంప్ వర్క్స లిమిటెడ్
పోస్టుబాక్స నెం 5551
మల్లేశ్వరం వెస్ట్ పోస్టు
బెంగుళూరు 560055

ఎంట్రీ ఫారం.




ఒక పదమువాడి వాక్యాన్ని పూర్తి చేయండి:

మైసూరు లాంప్సతో ఆ ____________ ప్రకాశవంతమైంది.

పేరు/విలాసము

మొదటి బహుమతి:
50,000 రూ. విలువగల బంగారం ఆభరణాలు
(లేక 50,000 రూ. నగదు)

రెండు ద్వితీయ బహుమతులు
ఒక్కొక్క బహుమతి: స్కూటర్
(లేక నగదుగా 11,000 రూ.)

మూడు తృతీయ బహుమతులు:
ఒక్కొక్క బహుమతి; మోపెడ్
(లేక నగదుగా 5,000 రూ)

నాలుగవ బహుమతులు: యాభై.
ఒక్కొక్క బహుమతి: వాచ్
(లేక నగదుగా 300 రూ)

1000 సమాధానపు బహుమతులు: టీషర్టు
ప్రతివారము మొట్టమొదటి ఎంట్రీ బహుమతులు: యాభై

CLARION/MLW/84184/Tel